క్లుప్తంగా

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందిస్తున్న గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరు ఉమామహేశ్వరరావు

దేవరపల్లి: క్రికెట్ పోటీల్లో వరుస విజయాలు సాధిస్తున్న మండలంలోని పల్లంట్ల జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులకు దాతలు తమ వంతు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. దేవరపల్లి గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఉమామహేశ్వరరావు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్‌ను శనివారం క్రీడాకారులకు అందజేశారు. పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ ఓరుగంటి రామకృష్ణం రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తాడిమళ్ల విద్యార్థుల ఎంపిక



వై.ప్రవీణ్



పి.కార్తీక్

నిడదవోలు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణ శాస్త్రి శనివారం తెలిపారు. అండర్–14 విభాగంలో పి.కార్తీక్ (డిస్కస్ త్రో), అండర్–17 విభాగంలో వై.ప్రవీణ్ (యోగా)కు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వారిద్దరినీ పీడీ బండి ప్రదీప్, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగరాజు అభినందించారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే భారీగా భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి అభిషేకం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ఉదయం ఏడు గంటల తర్వాత భక్తుల రద్దీ మరింత పెరిగింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధాన చేశారు. సుమారు 5 వేల మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. తణుకుకు చెందిన పీసపాటి శ్రీనివాస సుబ్రహ్మణ్య భరద్వాజ తన కుమార్తెను నిలువెత్తు బియ్యంతో తులాభారం నిర్వహించారు.

55 మందికి హోమియో వైద్య సేవలు

నిడదవోలు రూరల్: విశ్వమానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తాడిమళ్ల సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో హోమియో వైద్యుడు నిమ్మల రామారావు 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో మహాలయ అమావాస్య అన్నదానం

తాళ్లపూడి: మహాలయ అమావాస్య నాడు చేసే అన్నదానం వల్ల విశేష శుభ ఫలితాలు ఇస్తుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ అన్నారు. తాళ్లపూడి పుష్కర ఘాట్ వద్ద గల గౌతమేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహాలయ అమావాస్య అన్నదానం నిర్వహించారు. భూలోక సంచారానికి వచ్చే పితృదేవతల ప్రీతి కోసం మహాలయ అమావాస్య రోజు అన్నదానాన్ని నిర్వహించాలని పురాణాల్లో పేర్కొన్నారని రాధాకృష్ణ తెలిపారు. దాతల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 1500 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.కార్యక్రమంలో కవల శ్రీనివాస్, డీవీవీ సత్యనారాయణ, శింగం శివ, సిద్ధంశెట్టి బాలాజీ, రేకపల్లి వీరాస్వామి, కిల్లాని అప్పారావు, కోటేశ్వరరావు, మాగాపు విజయలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు

- అమ్మవారి ఆలయాల వద్ద పూర్తయిన ఏర్పాట్లు
- రోజుకొక అలంకారంలో దర్శనం ఇవ్వనున్న జగన్మాత



రంగులు వేసి ముస్తాబు చేసిన బ్రాహ్మణగూడెంలోని నాగరమ్మ వారి ఆలయం



తాళ్లపూడిలో నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ వారు



పాలంగిలోని కనకదుర్గమ్మ వారు

తాళ్లపూడి: శరన్నవరాత్ర మహోత్సవాలకు మండలంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం తాళ్లపూడితో పాటు, వేగేశ్వరపురంలోని మేదర్ల ఆధ్వర్యంలోను, గజ్జరం, తాడిపూడి, పైడిమెట్ట, అన్నదేవరపేట, మలకపల్లి తదితర గ్రామాల్లోనూ ఏర్పాట్లు జరిగాయి. తాళ్లపూడిలోని నవ దుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో 22వ దసరా మహోత్సవాలను ఆదివారం నుంచి ఈనెల 23 వరకూ నిర్వహిస్తామని నిర్వాహకుడు నీలి సూర్యనారాయణ శనివారం తెలిపారు. అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు రోజుకొక రూపంలో అలంకరించి, పూజలు చేస్తామన్నారు. ఆదివారం బాలాత్రిపుర సుందరీదేవిగా, 16న గాయత్రీదేవిగా, 17న అన్నపూర్ణాదేవిగా, 18న శ్రీ ధనలక్ష్మీదేవిగా, 19న మహాచండీదేవిగా, 20న సరస్వతీదేవిగా, 21న లలితా త్రిపుర సుందరీదేవిగా, 22న కనకదుర్గాదేవిగా, 23న మహిసాసుర మర్ధినిగా, అదే రోజు సాయంత్రం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 23న గ్రామంలో వైభవంగా రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని నవంబర్ 5న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీ మాత మందిరంలోను తొమ్మిది రోజుల పాటు నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. రోజూ తిథులను అనుసరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ తెలిపారు.

నేటి నుంచి స్వర్ణ దుర్గాశ్రమంలో..

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురంలోని సంజీవ కొండపై కొలువైన చక్ర సమేత స్వర్ణదుర్గా అమ్మవారి 83వ శరన్నవరాత్ర మహోత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 24 వరకూ నిర్వహిస్తారు. రామానంద భారతీజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోజూ ఆలయం వద్ద భక్తులతో అమ్మవారికి కుంకుమ పూజ లు, అన్నసమారాధనలు, హరినామ సంకీర్తనలు జరు గుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. అలాగే మండలంలోని తూర్పుచోడవరం, దూబచర్ల, కవులూరు, నల్లజర్ల వనదుర్గా ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి భక్తులు ఏర్పాట్లు చేశారు.

పాలంగిలో..

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం నుంచి ఈ నెల 24 వరకూ శరన్నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. తొమ్మిది రోజులూ అర్చకుడు శ్రీలక్ష్మీ ధన్వంతరి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు, అభిషేకాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశఋూరు. విద్యుత్తు దీపాలతో ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల సెట్టింగులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని మోర్త, ఉండ్రాజవరం, చివటం తదితర గ్రామాల అమ్మవారి ఆలయాల వద్ద కూడా దసరా మహోత్సవాల సందడి నెలకొంది.

చాగల్లు మండలంలో..

చాగల్లు: దసరా ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాల ప్రాంగణాల్లోని చలువ పందిళ్లను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. చాగల్లు, మీనానగరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు ముస్తాబు పూర్తయ్యింది. ఇక చాగల్లు మాతంగి చెరువు గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయ 47వ వార్షికోత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 23 వరకూ నిర్వహిస్తారు. ఇందు కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయం వద్ద కుంకుమ పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ పునః నిర్మాణ పనుల పరిశీలన



వేంకటేశ్వరస్వామి ఆలయం పునః నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో కొనసాగుతున్న రాజ్యలక్ష్మి గోదా సమేతా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను హోం మంత్రి తానేటి వనిత శనివారం పరిశీలించారు. ఆలయ సమీపంలో ప్రతిష్ఠించిన స్వామి వారిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు, ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి సత్యనారాయణాచారి ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ పునఃనిర్మాణ పనుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు.గర్భగుడి, గాలి గోపురం, మండపం పనులను మంత్రి పరిశీలించారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, గాజుల రంగారావు, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి.. సమస్యలు తెలుసుకుని..



బల్లిపాడులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



పెరవలి మండలం అన్నవరప్పాడులో ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- పరిష్కరిస్తున్నాం
- హోం మంత్రి తానేటి వనిత
- బల్లిపాడులో గడప గడపకూ..

తాళ్లపూడి: జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేయడంతో పాటు ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని బల్లిపాడు గ్రామంలో శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మంత్రి వనిత గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.సంక్షేమ పథకాలను వివరించే బుక్ లెట్‌లను ఆయా కుటుంబాలకు మంత్రి అందజేశారు.

30 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ

అనంతరం బల్లిపాడు గ్రామంలో 30 మంది పేదలకు ఇంటి స్థలాల పట్టాలను మంత్రి వనిత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోనే భూమిని సేకరించి అర్హులకు ఇంటి పట్టాలుగా ఇచ్చామన్నారు అంతే గాకుండా ఆ స్థలాన్ని ప్రభుత్వమే మెరక చేసి ఇస్తుందన్నారు.మెరక పనులను ఇప్పటికే మొదలు పెట్టినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. దమయంతి, నాయకులు తోట రామకృష్ణ, గనిశెట్టి బంగారు రాజు, తహసీల్దార్ టి.రాధిక, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో మూడో రోజు..

పెరవలి: సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో లేదో తెలుసుకునేందుకు, గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని అన్నవరప్పాడులో మూడో రోజు శనివారం కూడా ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో లబ్ధి పొందని ఇళ్లే లేవన్నారు. ప్రతి ఇంటికి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. గత నాలుగున్నరేళ్లలో అన్నవరప్పాడు వాసుల సంక్షేమానికి, గ్రామాభివృద్ధికి రూ.15 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ పంతం బాల సుందరి, సొసైటీ అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పులపర్తి శక్తి ప్రసాద్, పంతం సత్యనారాయణ (చిన్న), వాసంశెట్టి రాము, పార్టీ అధ్యక్షుడు వసంతాడ బుజ్జి, గుత్తుల మహాలక్ష్మి వివిధ శాఖల అధికారులు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నిడదవోలు: పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఈనెల 17వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి శనివారం తెలిపారు. పట్టణంలోని చర్చిపేట సచివాలయం పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హాజరవుతారని చెప్పారు.

నేడు కొవ్వూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

కొవ్వూరు: పట్టణంలోని చిన్న వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలోని జీకే స్టడీ సెంటర్ వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకుడు గెల్లా కేశవ శనివారం తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నా రు.నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

కరవుభత్యం, ఎరియర్స్, పీఆర్సీ విడుదల చేయాలి

నల్లజర్ల: తమకు కరవు భత్యం బకాయిలు, ఎరియర్స్, పీఆర్సీ విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. రిటైర్డు ఉద్యోగుల సంఘ సమావేశం ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన శనివారం నల్లజర్లలో జరిగింది.హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని కోరారు.సమావేశంలో రాష్ట్ర సంఘ అసోసియేట్ అధ్యక్షుడు జి.జేమ్స్, ఉపాధ్యక్షుడు బండి సూర్య ప్రకాశరావు, ఎస్ఎం ఆలీసాహెబ్, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ప్రభుదాస్, బాలయ్య, ఐడీవీ అప్పారావు, ఏసురత్నం, ప్రతాప్, దత్తు, ఝాన్సీరాణి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్



ఎస్. శ్రీనివాస రావు, జడ్జి

కొవ్వూరు: స్థానిక కోర్టు ప్రాంగణంలో ఈ నెల 21న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు.పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహన ప్రమాదాల కేసులు, భూ నష్ట పరిహారం కేసుల పరిష్కారానికి ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పరుచుకోవాలని ఆయన సూచించారు.

రాజేష్ కుటుంబానికి మండలి చైర్మన్ పరామర్శ

కొవ్వూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కప్పల రాజేష్ కుటుంబాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శనివారం పరామర్శించారు. ఇటీవల రాజేష్ తల్లి పాపయమ్మ మృతి చెందారు. మోషేన్‌రాజు స్థానిక 11వ వార్డులోని రాజేష్ స్వగృహానికి వచ్చి, పాపాయమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.రాజేష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ని, సంతాపాన్ని తెలిపారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు పరిమి హరిచరణ్, ముళ్లపూడి కాశీవిశ్వనాథ్, పరిమి సోమరాజు, కంఠమణి రమేష్, గారపాటి వెంకటకృష్ణ, బండి అశోక్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యే సంతాపం

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దారి సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్బిన రాంబాబు మాతృమూర్తి పార్వతి (74) శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కాల్దారి గ్రామంలోని రాంబాబు ఇంటికి వచ్చి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యు డు నందిగం భాస్కర రామయ్య, అబ్బిన సత్యనారాయణ, వీరవల్లి పార్వతి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు రెండు ఇన్వర్టర్ల బహూకరణ

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు రెండు ఇన్వర్టర్లను అందజేసినట్టు హెచ్ఎం వి.సూర్యనారాయణ శాస్త్రి శనివారం తెలిపారు. దాతలు కె.నారాయణమూర్తి (తాడిమళ్ల), తుమ్మలపల్లి భ్రమరాంబ వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం), యంత్రప్రగడ వెంకటేశ్వరరావు (చిక్కాల)లు రూ.40 వేల ఆర్థిక సహాయంతో రెండు ఇన్వర్టర్లను కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తిరుమళ్ల దుర్గారావు, ఉపాధ్యాయులు డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు


పలువురి ఎంపిక



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

దేవరపల్లి: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 11న కొవ్వూరు మండలం దొమ్మేరులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17 బాల బాలికల సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో తొమ్మిది మంది ఎంపికైనట్టు పీఈటీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. అండర్–14 విభాగంలో పాకా దుర్గా మధురశ్రీ , అండర్–17 విభాగంలో కునపం మానస, కునపం సిరి, అండర్–19 విభాగంలో ఇవ్వల కిరణ్మయి, కాసాని అనూష ఎంపికయ్యారు. బాలుర విభాగంలో పిల్లి శారద, దగ్గుమెల్లి శరత్, పిల్లి సిద్దార్థ, గట్టు జశ్వంత్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. టెన్నికాయిట్ అండర్–19 బాలికల విభాగంలో లింగంకుంట మౌనిక, ఫుట్‌బాల్ అండర్ 14 విభాగంలో యంగల భానుకిరణ్, అండర్– 17 విభాగంలో సోమిశెట్టి అరవింద్ ఎంపికైనట్టు పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఆయిల్ పామ్ గెలల ధర పతనం



ఆయిల్‌పామ్ గెలలు

నల్లజర్ల: ఆయిల్ పామ్ గెలల ధర గణనీయంగా పడిపోయింది. దీంతో సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. సెప్టెంబరు నెలకు ఆయిల్ పామ్ గెలల టన్ను ధర రూ.12,122గా ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు నెల రేటుతో పోల్చుకుంటే ఇది రూ.831 తక్కువ. ఈ ఏడాది మే నెలలో టన్ను ధర రూ.23,365కు చేరింది. తర్వాత క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ట్రిపుల్ ఎఫ్ ఫ్యాక్టరీ పరిధిలో పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని నల్లజర్ల, దేవరపల్లి, భీమడోలు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, చాగల్లు, మొగల్తూరు, పాలకొల్లు, నర్సాపురం మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. దాదాపు 14,500 మంది రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న అన్నిరకాల నూనెలపై కేంద్ర ప్రభుత్వం సుంకాన్ని రద్దు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. 2024 ఎన్నికల తర్వాత ధరలు ఆశాజనకంగా ఉండవచ్చుని రైతులు చెబుతున్నారు.

జూనియర్ కళాశాలలో నా మట్టి– నా దేశం



నా మట్టి– నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్న అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం నా మట్టి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మేరీ సుజాత తన ప్రసంగంలో ఈ కార్యక్రమం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రధాన మంత్రి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో భారతీయులుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మేరా భారత్ మహాన్ అంటూ ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నినదించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటరమణ, అధ్యాపకులు హరీష్, ప్రసన్నకుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు



జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.85 లక్షల వ్యయంతో దేవరపల్లిలో జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు

దేవరపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, బోర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దేవరపల్లిలో రూ.85 లక్షల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ పథకంలో మంచినీటి పైపులైన్ల నిర్మాణం జరుగుతోంది. ఇందిరమ్మ కాలనీ, చంద్రబాబు కాలనీ, ఇతర ప్రాంతాలకు మంచినీటి సరఫరాకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. బచ్చియపాలెం రోడ్డులోని మంచినీటి బోరు నుంచి పేరమ్మ చెరువు వద్ద గల ఓవర్ హెడ్ ట్యాంకుకు, యాదవోలు రోడ్డులోని బోరు నుంచి చంద్రబాబు కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు, గ్రామ సచివాలయం వద్ద గల ట్యాంకుకు మంచినీటి సరఫరా చేయడానికి పైపులైన్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. దీంతో దేవరపల్లిలో మంచినీటి సమస్య తీరుతుందని సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు.అలాగే దుద్దుకూరులో రూ.55 లక్షల వ్యయంతో మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. రూ.8 లక్షల వ్యయంతో ఊర చెరువు గట్టున బోరు వేసి, ఓవర్ హెడ్ ట్యాంకు వరకూ పైపులైన్ వేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బాలికల ప్రత్యేక వసతిగృహం వద్ద రూ.40 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేస్తున్నట్టు సర్పంచ్ బొంతా నాగమణి, సొసైటీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ తెలిపారు.